

మన ఇంటి బతుకమ్మకి స్వాగతం - సుస్వాగతం
మెదక్ పట్టణంలో జరిగే మన ఇంటి బతుకమ్మ
సంబరాలకు విచ్చేయుచున్న ఆడపడుచులకు,
అతిరధ మహారధులందరికి ఆత్మీయ
స్వాగతం - సుస్వాగతం
మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో
తేది: 07 అక్టోబర్ 2024 సోమవారం రోజున సా॥ 4.00 గం.లకు
ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం - మెదక్
ఆంధ్రజ్యోతి దినపత్రికకు
22వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
డా॥ మైనంపల్లి రోహిత్ రావు - శివాని
శాసన సభ్యులు - మెదక్
MSSO CHAIRMAN
మైనంపల్లి హన్మంత రావు - వాణి
మాజీ శాసన సభ్యులు - మెదక్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
7
సోమవారం 7 అక్టోబరు 2024



ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ

- క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ శ్రేయాల్
- ఉమ్మడి జిల్లా నుంచి 640 మంది క్యాడెట్లకు శిక్షణ



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న కల్నల్ రమేశ్ శ్రేయాల్

గజ్వేల్, అక్టోబరు 6 : ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ శ్రేయాల్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ 33 తెలంగాణ బెటాలియన్ సంగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్ కంబైండ్ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ క్యాంపులో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన 640 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. క్యాడెట్లకు కవాతు, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, సైనిక సంబంధ అంశాలలో శిక్షణ ఇవ్వడంతో పాటు ట్రాఫిక్ రూల్స్, సైబర్‌క్రైమ్స్‌పై అవగాహన, వేస్ట్ మేనేజ్మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ గణపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్నల్ రమేశ్ శ్రేయాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థులలో క్రమశిక్షణతో పాటు జాతీయ భావం పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు క్రీడలు, సాహిత్య కార్యక్రమాల్లో గెలపొందిన క్యాడెట్లకు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆడం ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పీఎంఎస్ రావు, సెబేదార్ మేజర్ రామ్‌హరి, ఎన్‌వో లెఫ్టినెంట్ మహేందర్‌రెడ్డి, వెంకటేశం, సత్య, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.



రిజర్వాయర్ కట్టకు దగ్గరలో ఉన్న తుక్కాపూర్ గ్రామం

మల్లన్నసాగర్ నిర్వాసితుల వెతలు తీరేనా?

- అటు రిజర్వాయర్.. ఇటు అదనపు టీఎంసీ కాలువ
- ఉన్నభూమి పోయి ఉపాధి కరువాయే
- తుక్కాపూర్ గ్రామంలో ఉండలేమంటూ ఆవేదన
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించి ఆదుకోవాలని వేడుకోలు

తొగుట, అక్టోబరు 6 : 'సారు.. మా నోట్లో మట్టిపోయకుండ్రి.. ఉన్న భూమి పోయే.... ఉపాధి లేకపాయే.. ఇప్పుడు ఒకవైపు రిజర్వాయర్ మరోవైపు అదనపు టీఎంసీ కాలువ నిర్మాణం వల్ల ఇళ్లకు నీటి ఊటలు రావట్టే.. ఎట్లా బతికేది... మమ్మల్ని ఆగం చేయకుండ్రి... ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించి ఆదుకోండి' అంటూ మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన తొగుట మండలం తుక్కాపూర్ గ్రామస్థులు వేడుకుంటున్నారు.

పది మీటర్ల దూరంలోనే కట్ట

తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో 1360 ఎకరాల భూమి ఉండగా అందులో మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం ప్రభుత్వం 1200 ఎకరాలను రైతుల నుంచి సేకరించింది. రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి అందులో ప్రస్తుతం 21.12 టీఎంసీల నీటిని నిల్వ చేసింది. దాంతో పాటు తుక్కాపూర్ గ్రామ శివారులోనే 300 మీటర్ల వెడల్పుతో అడిషనల్ ఓపెన్ కెనాల్, పంపుహౌజ్ నిర్మాణం పేరుతో అదనంగా రైతుల నుంచి గ్రామంలో 72 ఎకరాల భూమిని సేకరించి పనులు చేపట్టారు. మల్లన్నసాగర్ కట్ట తుక్కాపూర్ గ్రామ ఇళ్లకు కేవలం 10 మీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. ఈ క్రమంలో గ్రామస్థులు పలుమార్లు తమ ఇళ్ల పక్కన కట్ట ఉండటంతో తమకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అటు కట్ట.. ఇటు అదనపు టీఎంసీ కాలువతో ఇళ్లలోని సెప్టిక్ ట్యాంక్‌లు, చేతబావులు నిండి నీటి ఊటలు పైకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో ఇళ్లు కూలిపోయే ప్రమాదముందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.

పరిహారం అంతంతే!

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం తుక్కాపూర్ గ్రామస్థులు తమ భూములను ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయగా అప్పుడు పట్టా భూములకు ఎకరాకు రూ.5.50 లక్షలు, అసైన్డ్‌భూమికి రూ.3.75 లక్షలు చెల్లించారు. వేరే గ్రామాలకు పరిహారం పెంచితే వీరికి పెంచుతామని నచ్చజెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఉన్న భూములు పోయాయని, మల్లన్నసాగర్ కట్టతో తమ జీవితాలకు ప్రమాదం ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఊరును కూడా మల్లన్నసాగర్‌లోనే ముంచి మాకు జీవనోపాధితోపాటు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించాలని వేడుకుంటున్నారు.

హామీ ఇచ్చినా..

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను 2022 ఫిబ్రవరి 22న ప్రారంభించగా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తుక్కాపూర్ గ్రామస్థుల సమస్యలపై అప్పటి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. మరో రూ.100 కోట్లు ఖర్చయినా సరే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సభలో ప్రకటించారు. హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న ఉన్న చందంగా మారింది.

న్యాయం జరిగేనా?

మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామమైనా తుక్కాపూర్ గ్రామంలో ఈనెల 1న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, తూంకుట నర్సారెడ్డిలతో పాటు పలువురు కాంగ్రెస్ నేతల బృందం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని వారు గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేనా అని నిర్వాసితులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోండి



మల్లన్నసాగర్‌లో ఉన్న భూమి పోయింది. ఇల్లే మిగిలింది. ఇన్ని రోజులు భూమిని నమ్ముకొని బతికాం. వ్యవసాయం తప్ప వేరే పని తెలియదు. ఇపుడు అటు కట్ట.. ఇటు అదనపు టీఎంసీ కాలువ వల్ల ఉన్న ఇల్లు ఎప్పుడు కూలుతుందో తెలియదు. మాకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలి.

- మూష్టి యాదయ్య, తుక్కాపూర్

పనిలేదు బతికేదెట్లా...?



గ్రామంలో భూమి ఉంటే కూలీకి పోయేటోళ్లం.. పనులు లేక పస్తులుంటున్నం. చాతనైనోళ్లు వేరే ఊరికి పనులకు పోతున్నరు. మాకు దూరం పోవడం చేతకాక ఇంటికాడనే ఉంటున్నం. మేమెట్లా బతికేది. మాకు న్యాయం చేయాలి.

- చిక్కుడు సరోజన

నేడు మెదక్‌లో మన ఇంటి బతుకమ్మ

- పదివేల మంది మహిళలతో మహా ఉత్సవం
- హాజరుకానున్న మంత్రులు సీతక్క కొండా సురేఖ, దామోదర్
- మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు



కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మెదక్, అక్టోబరు 6. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు మైనంపల్లి సోషల్ సర్వీస్ భారీ ఏర్పాట్లు చేసింది. కనీవినీ ఎరగని రీతిలో మహా బతుకమ్మ వేడుకలను మెదక్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఆరెళ్ల శారద హాజరు కానున్నారు. ప్రముఖ గాయని మంగ్లీ సాయంత్రం నుంచి రాత్రి వరకు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా పాటలు పాడుతూ వేడుకల్లో పాలుపంచుకోనున్నారు. 10 వేల మంది మహిళలు హాజరయ్యేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమం కొనసాగనున్నది. ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మెదక్‌లోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌ను పరిశీలించారు. వేడుకలకు విచ్చేయనున్న మహిళలకు అసౌకర్యం కలగకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, ప్రముఖ న్యాయవాది జీవన్‌రావు, నాయకులు బొజ్జపవన్, ఉప్పల రాజేష్, ఆంజనేయులుగౌడ్, గూడూరి కృష్ణ, కౌన్సిలర్ లింగం, ఒమర్, సమీయొద్దీన్, సుప్రభాతరావు, మహిపాల్, నర్సింహ తదితరులు ఉన్నారు.



వేడుకలకు ముస్తాబవుతున్న కాలేజీ గ్రౌండ్

మహాగౌరీ నమోస్తుతే

దేవీశరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాల దగ్గర బతుకమ్మలనూ ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం నెలకొన్నది. చిన్నారులు, యువతులు, మహిళలు బతుకమ్మలను పేర్చి దేవీ మండపం దగ్గర ఆడిపాడుతున్నారు. తీరొక్క నైవేద్యాలను మాతకు సమర్పించి తమ కోర్కెలను తీర్చమని, కష్టాల నుంచి గట్టెక్కించమని వేడుకుంటున్నారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఆయా చోట్ల ముగ్గుల పోటీలు, అన్నదానాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



వర్గల్ విద్యాధరి క్షేత్రంలో శ్రీగౌరిదేవిగా విద్యా సరస్వతీ అమ్మవారు



సిద్దిపేట కల్చరల్: అమ్మవారికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు



గజ్వేల్‌లోని మహాకాళీ అమ్మవారికి పూజ చేస్తున్న మాధవానంద సరస్వతి



దుబ్బాకలోని యువకిరణ్ స్పోర్ట్ సంఘం వద్ద ఏర్పాటు చేసిన మత్తు వదలారా ఫ్లెక్సీ



కొండపాక: మర్పడగ ఆలయంలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు



గజ్వేల్ రూరల్: కొడకండ్లలో దుర్గమాత వద్ద భక్తుల పూజలు



చేర్యాలో చావడి వద్ద దేవీస్నేహ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలో చిన్నారులు

బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు గుండెపోటు

- ఆస్పత్రికి తరలించిన ప్రయాణికులు
- చికిత్స పొందుతూ మృతి



రమేశ్‌సింగ్ మృతదేహం

వర్గల్, అక్టోబరు 6 : హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. ప్రయాణికులు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన ఆదివారం వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారి సమీపంలో చోటు చేసుకున్నది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్సు డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఠాగూర్ రమేష్‌సింగ్(46) హుజూరాబాద్ డిపోకు చెందిన అద్దె బస్సు డీఆర్‌డీఏ మీటింగ్ కోసం 45 మంది ప్రయాణికులతో కలిసి హైదరాబాద్‌కు వెళుతున్నాడు. వర్గల్ మండలం గౌరారం సమీపంలోని గోదావరి రుచులు టిఫిన్ సెంటర్ వద్ద టిఫిన్ చేయడం కోసం బస్సును నిలిపారు. టిఫిన్ చేసిన తర్వాత వెళ్దామనే సరికి ఛాతిలో నొప్పి రావడంతో ప్రయాణికులకు తెలిపాడు. వారు అంబులెన్స్ సహాయంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా రమేశ్ సింగ్ మృతి చెందాడు. విషయాన్ని హుజూరాబాద్ డిపో మెనేజర్‌కు తెలియజేయగా కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు రాగానే రమేశ్ సింగ్ మృతదేహన్ని అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, అక్టోబరు 6: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం ముగ్గీస్‌పల్లికి చెందిన కొత్త శివ(21) కుటుంబసభ్యులతో కలిసి గజ్వేల్‌లో నివాసం ఉంటున్నాడు. ద్విచక్రవాహనంపై ప్రజ్ఞాపూర్ నుంచి గౌరారానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొట్టిన కారు.. ముగ్గురికి స్వల్పగాయాలు

కొండపాక, అక్టోబరు 6: లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైయ్యాయి. ఈ సంఘటన కొండపాక గేటు వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలం వడ్లూరుకు చెందిన శేఖర్ దుబాయ్ నుంచి వచ్చాడు. ఆయన మిత్రులు అజయ్, సతీష్ ఇద్దరు కలిసి ఎయిర్‌పోర్ట్ నుంచి తీసుకుని కారులో వడ్లూరుకు వెళ్తున్న క్రమంలో కొండపాక గేటు వద్ద రాజీవ్ రహదారిపై ముందుగా వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేసి ఎడమవైపు మలుపు తీసుకుంటున్న క్రమంలో వీరి కారు ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై బెలూన్స్ ఓపెన్ అయ్యాయి. కారులో ప్రయాణం చేస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స చేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

గజ్వేల్ రూరల్, అక్టోబరు 6: ద్విచక్రవాహనాలను దొంగిలించిన వ్యక్తిని బేగంపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. బేగంపేట ఏఎస్ఐ అమృత్ తెలిపిన వివరాల ప్రకారం మక్తమాసాన్‌పల్లి బస్‌స్టాప్ వద్ద బేగంపేట ఏఎస్ఐ అమృత్ తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని విచారించగా, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్‌కు చెందిన కమ్మరి నర్సింహచారి మరో ఇద్దరు మైనర్లతో కలిసి గత నెల 21 రాత్రి వర్గల్ మండలం శాఖరం చౌరస్తా వద్ద బైకును దొంగలించినట్టు ఒప్పుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కమ్మరి నర్సింహచారిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కి పంపినట్లు పోలీసులు తెలిపారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

చేర్యాల, అక్టోబరు 6: కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖమండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగు చెట్టు ప్రాంతం సందడిగా మారింది. తమ కోర్కెలను ఈడేర్చమని గంగిరేగు చెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లుపర్యవేక్షించారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 6: గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. ఆయన రాష్ట్ర ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. 75 సంవత్సరాల కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రజలు నలిగిపోయారని, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు కేసీఆర్ చావునోట్లో తలకాయ పెట్టి సాధించారన్నారు. అబద్ధపు, అసత్యపు, అమలు కాని హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. కాంగ్రెస్‌లో అనేక గ్రూప్‌లు ఉన్నాయని, నామినేటెడ్ పదవుల కోసం పాకులాడుతూ మతిభ్రమించి వారు చిల్లరమల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్.సీ రాజమౌళి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు బెండే మధు, మాజీ సర్పంచులు తదితరులు ఉన్నారు.

మూసీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాలి

- ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

గజ్వేల్, అక్టోబరు 6: మూసీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాలని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నసీరుద్దీన్, మోహినుద్దీన్‌లకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అప్పటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. మూసీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకులు దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

ఆర్ఎస్ఎస్ పథ్ సంచాలన్

చేర్యాల, అక్టోబరు 6: ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం చేర్యాలలో విజయదశమి ఉత్సవం, పథ్ సంచాలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చేతిలో కర్ర పట్టుకుని ఘనావేశ్‌తో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి ఆదిశంకర మందిరం వరకు రూట్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమారోప్ కార్యక్రమంలో వక్తలుగా రెఫ్లెక్షన్ చానల్ ఫౌండర్ దేశపతి ఆమోఘ్, ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ సంపర్క ప్రముఖ్ మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయం, హిందూ ధర్మంపై జరుగుతున్న దాడుల నుంచి కాపాడుకునేందుకు జాగృతమవ్వాల్సి ఉందన్నారు.

● గజ్వేల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ అన్నారు. గజ్వేల్ పట్టణంలో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా సేవాభారతి ట్రస్ట్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజిషియన్ ఆకుల నరేశ్‌బాబు, సాయినాథ్‌రెడ్డి, శ్రీధర్, శివకుమార్, నాయకులు వెంకటరమణ, యెల్లు రాంరెడ్డి, నాగేందర్, విష్ణు, అరవింద్, రమణ ఉన్నారు.



చేర్యాలలో పథసంచాలన్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

అట్ల బతుకమ్మ

ఆడపడుచులు అయిదో రోజు రంగురంగుల పూలతో అట్ల బతుకమ్మను పేర్చి ఆడారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, పలు వార్డుల్లో మహిళలు బతుకమ్మలను చేశారు.

- సిద్దిపేట కల్చరల్



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



39వ వార్డులో బతుకమ్మ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్ దీప్తి

జాతీయ రహదారిపై వెలుగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై వెలుగుతున్న లైట్లు

చేర్యాల, అక్టోబరు 6: చేర్యాల పట్టణంలోని జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌ను తాత్కాలికంగా పునరుద్ధరించారు. ఈనెల 5న ఆంధ్రజ్యోతిలో 'చీకట్లో చేర్యాల' శీర్షికన కథనం ప్రచురితమైంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసినప్పటికీ రోడ్డు విస్తరణపనుల కారణంగా కొన్ని నెలలక్రితం విద్యుత్ లైన్ ధ్వంసమవడంతో లైటింగ్‌ను నిలిపివేశారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న కథనానికి వారు స్పందించి పాత సెంట్రల్ లైటింగ్ స్తంభాల గుండా తాత్కాలిక విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి ఆదివారం పునరుద్ధరించారు.

ప్రాణం తీసిన నగల తాకట్టు

● దంపతుల మధ్య గొడవ .. భర్త ఆత్మహత్య


శ్రీశైలం మృతదేహం

తూప్రాన్, అక్టోబరు 6: భార్య నగలు కుదువ పెట్టడంతో దంపతుల మధ్య గొడవ జరగగా.. మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన పూదూరి శ్రీశైలం యాదవ్(45) టైల్స్ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఇల్లు కొనుగోలు చేసి ఏడాదిగా భార్య పిల్లలతో నివాసముంటున్నాడు. బతుకమ్మ, దసరా పండుగకు దుస్తులు కొనుగోలు చేసేందుకు శ్రీశైలం భార్య బాలమణి నగలు కుదువ పెట్టాడు. ఈ విషయమై దంపతుల మధ్య గొడవ చోటుచేసుకోగా మనస్తాపానికి గురైన శ్రీశైలం శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. మరో గదిలో పడుకున్న భార్య బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా గడియ పెట్టి ఉండటం, పిలిచినప్పటికీ భర్త పలకకపోవడంతో పక్కింటోళ్లకు ఫోన్ చేసింది. వారు వచ్చి కిటికీలో నుంచి చూడగా శ్రీశైలం ఉరివేసుకుని కనిపించాడు. తలుపులు పగుల గొట్టి అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ పోషణ భారమై వ్యక్తి ఆత్మహత్య


కుమార్ (ఫైల్)

నిజాంపేట, అక్టోబరు 6 : కుటుంబ పోషణ భారమై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్ (41) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబాన్ని పోషించలేకపోతున్నానని మనోవేదన గురై శనివారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పార్శ్వనాథుడి విగ్రహాల సందర్శన


టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో పార్శనాథుడి విగ్రహాన్ని పరిశీలిస్తున్న జైనులు

టేక్మాల్, అక్టోబరు 6: ఇటీవల అపహరణకు గురైన పార్శనాథుని విగ్రహాన్ని ఢిల్లీ, హైదరాబాద్‌కు చెందిన జైన మత పెద్దలు ఆదివారం పరిశీలించారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో దేవతల గుట్టపైన ఉన్న పురాతన జైన మత 23వ తీర్థంకరుడు పార్శనాథుడి విగ్రహాన్ని రెండునెలల కిందట దొంగిలించారు. అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ పోలీసుల సహకారంతో దొంగలించిన విగ్రహాన్ని తిరిగి తెప్పించారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్, ఢిల్లీకి చెందిన జైన మత పెద్దలు మనోజ్ జైన్, ఆశిస్ జైన్ కుటుంబ సమేతంగా రాగా... వారితోపాటు జోగిపేటకు చెందిన వర్ధమాన్ జైన్, కృష్ణ ప్రసాద్ జైన్, జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జోగినాథ్‌తో కలిసి టేక్మాల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న జైన విగ్రహాన్ని పరిశీలించారు. వేల్పుగొండలో విగ్రహం దొంగలించిన స్థలాన్ని, అక్కడే ఉన్న రామమందిరం ఆలయం కొండపై భారీ ఏకశిలపై చెక్కిన పార్శ్వనాథుడి విగ్రహాన్ని పరిశీలించారు. అంతకుముందు రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని గ్రామస్థులతో కలిసి సందర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ, బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్‌గుప్తా, సుధాకర్‌రెడ్డి, రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జశ్వంత్‌రాథోడ్



సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 6 : అమీన్‌పూర్ మండలం బృందావన్ టీచర్స్ కాలనీకి చెందిన బానోతు జశ్వంత్ రాథోడ్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు హాజరయ్యాడు. ఇటీవల జరిగిన సీఐఎస్‌సీఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ రీజినల్ మేనేజర్ ఆంటోనీరెడ్డి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో జశ్వంత్‌రాథోడ్ పాల్గొని రాణించారని తెలిపారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే ధ్యేయం

● ఉమ్మడి జిల్లా ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవహ నాగభూషణం


ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

నర్సాపూర్, అక్టోబరు 6: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే ఆర్ఎస్ఎస్ ధ్యేయమని ఉమ్మడి జిల్లా కార్యవహ నాగభూషణం పేర్కొన్నారు. ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పురవీధులలో మార్చ్‌పాస్టు చేసి స్థానిక జూనియర్ కాలేజీ మైదానంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వీణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ పాశ్చాత్య పోకడలతో నేటి యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటుందన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ దేశంపై ప్రేమతో క్రమశిక్షణతో మెలిగినప్పుడే జీవితం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా కార్యవహ ఓంకార్, ప్రతినిధులు సిద్దుల నాగరాజు, అశోక్, సాయి, కిరణ్, బసప్ప, రమేష్, మాజీ ఎంపీపీ రమణారావు, కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని.. యువకుడి దుర్మరణం

రామాయంపేట, అక్టోబరు 6 : గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన ముత్యపు వెంకటి(35) పని నిమిత్తం రామాయంపేటకు వచ్చి ఆదివారం రాత్రి తన బైకుపై తిరిగి వెళ్తున్నాడు. గ్రామ శివారులోకి రాగానే అతడి బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం


నర్సయ్య (ఫైల్)

చేగుంట, అక్టోబరు 6: అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మక్కరాజిపేట్ గ్రామానికి చెందిన అంతు నర్సయ్య (69) గత నెల 14 న ఉదయం ఇంటి నుంచి పశువులను తీసుకుని పొలం వద్దకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 16న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, శనివారం రాత్రి మక్కరాజిపేట్ గ్రామ శివారులోని లింగకుంట చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహం నర్సయ్యదిగా గుర్తించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

సీఈవోను తొలగించాలని ఫిర్యాదు

● డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ రామచంద్రం


మాట్లాడుతూన్న రామచంద్రం

చిన్నకోడూరు, అక్టోబరు 6 : అల్లీపూర్ పీఏసీఎస్ సీఈవోను తొలగించాలని గత నెలలో డీసీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ నముండ్ల రామచంద్రం తెలిపారు. చిన్నకోడూరులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సొసైటీలో జరిగిన అక్రమాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి సీఈవోకు రికవరీ నోటీసులు ఇచ్చారన్నారు. డబ్బులను పూర్తిస్థాయిలో రికవరీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఇటీవల అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించి ఆ పత్రాన్ని జిల్లా సహకార సంఘం కార్యాలయంలో అందించినట్లు తెలిపారు. సొసైటీలో జరిగిన అక్రమాలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యులు హరిబాబు, కొట్టాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి


వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి


- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం


రాజుయాదవ్


శ్రావణి (ఫైల్)

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.